# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 10-10-2023** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **కృష్ణా జలాల అంశంపై ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్ మోహన్‌రెడ్డి ఉన్నతాధికారులతో చర్చించారు.**
2. **తెలంగాణా రాష్ట్రంలో కొత్తగా ఓటు హక్కు పొందేందుకు ఈ నెల 31వ తేదీ లోపు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంది.**
3. **తెలంగాణా రాష్ట్ర శాసన సభకు ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో మొత్తం 35 వేలకు పైగా పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు.**
4. **స్కిల్ డెవలప్మెంట్ కేసులో తెలుగుదేశం పార్టీ అధినేత ఎన్. చంద్రబాబు నాయుడు సుప్రీం కోర్టులో దాఖలు చేసిన క్వాష్ పిటిషన్ పై విచారణ ఈరోజుకు వాయిదా పడింది.**
5. **ఈరోజు జాతీయ తపాలా దినోత్సవం నిర్వహిస్తున్నారు.**

==========================

కృష్ణా జలాల అంశంపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్ మోహన రెడ్డి నిన్న ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించారు. గుంటూరు జిల్లా తాడేపల్లిలో జరిగిన ఈ సమావేశంలో .... కృష్ణా జలాల అంశంపై కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన తాజా విధి విధానాలపై జగన్ మోహన రెడ్డి చర్చించినట్టు సమాచారం. ఈ అంశంపై సుప్రీం కోర్టులో రాష్ట్ర ప్రభుత్వం స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేసే ఆలోచనలో ఉన్నట్టు తెలుస్తోంది.

---------------------------

“ఆంధ్రప్రదేశ్‌కు జగన్ ఎందుకు అవసరం”- “వై ఏపీ నీడ్స్ జగన్” అన్న పేరుతో ముఖ్యమంత్రి వై ఎస్ జగన్ మోహన రెడ్డి నవంబర్ ఒకటవ తేదీ నుండి మరొక కొత్త కార్యక్రమం ప్రారంభించనున్నారు. విజయవాడ నగరంలో నిన్న జరిగిన వై.ఎస్.ఆర్. కాంగ్రెస్ పార్టీ విస్తృత స్థాయీ సమావేశంలో ముఖ్య మంత్రి ఈ విషయం ప్రకటిస్తూ ... వచ్చే డిసెంబర్ 10 వ తేదీ వరకు జరగనున్న ఈ కార్యక్రమం కింద రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాల గురించి ప్రజలకు మరింత అవగాహన కల్పిస్తామని తెలిపారు. కాగా .... అక్టోబర్ 25 నుండి డిసెంబర్ 31వ తేదీ వరకు రాష్ట్ర వ్యాప్తంగా మూడు ప్రాంతాలలో బస్సు యాత్ర నిర్వహిస్తామని చెప్పారు. ఈ బస్సు యాత్ర బృందంలో షెడ్యూల్డ్ కులాలు ...., షెడ్యూల్డ్ తెగలు ...., వెనుక బడిన తరగతులు ...., అల్ప సంఖ్యాక వర్గాల నాయకులు ఉంటారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమాల సందర్భంగా ప్రతి రోజూ మూడు సమావేశాలు జరుగుతాయని ...., ప్రభుత్వం చేసిన మంచి పనులు ...., సామాజిక న్యాయం ...., సాధికారిత వంటి అంశాల గురించి కూడా ప్రజలకు అవగాహన కల్పిస్తామని జగన్ మోహన రెడ్డి వివరించారు.

---

తెలంగాణా రాష్ట్ర శాసన సభకు వచ్చే నవంబర్ 30 వ తేదీన పోలింగ్ జరగనున్న నేపథ్యంలో కొత్తగా ఓటు హక్కు పొందడం కోసం ఈ నెల 31 వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవచ్చునని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి వికాస్ రాజ్ తెలిపారు. కేంద్ర ఎన్నికల సంఘం ఎన్నికల షెడ్యూల్ ను విడుదల చేసిన సందర్భంగా హైదరాబాదులో నిన్న ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ ..... ఓటరు గుర్తింపు కార్డుకు ప్రత్యామ్నాయంగా ప్రజలు ఇతరత్రా 12 గుర్తింపు కార్డులను వినియోగించ వచ్చని తెలిపారు. ఏవైనా ఫిర్యాదుల కోసం అభ్యర్థులు 1950 నంబర్ ను సంప్రతించాలని సూచించారు. మహిళలు ... యువత కోసం ప్రత్యేక పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని ...., అన్ని పోలింగ్ కేంద్రాలలో బెయిలీ బ్యాలెట్ పత్రాలు కూడా అందుబాటులో ఉంటాయని ఆయన తెలిపారు. రాష్ట్రంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులోకి వచ్చిందని ..., ఈ నియమావళిని రాజకీయ పార్టీలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు.

---

తెలంగాణా శాసన సభకు జరగనున్న ఎన్నికలకు సంబంధించి రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 35 వేల 356 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్టు కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. వీటిలో 14 వేల 464 కేంద్రాలు పట్టణ ప్రాంతాలు ...., 20 వేల 892 కేంద్రాలను గ్రామీణ ప్రాంతాలలో ఏర్పాటు చేస్తున్నారు. సగటున ప్రతి పోలింగ్ కేంద్రంలో 897 మంది ఓటర్లు ఉన్నారు. 27 వేల 798 కేంద్రాలలో వెబ్ కాస్టింగ్ ఏర్పాటు చేశారు. ఇక ... మహిళల కోసం ప్రత్యేకంగా 597 కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. కాగా ....విభిన్న ప్రతిభావంతుల కోసం 120 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు.

---

తెలంగాణా రాష్ట్ర శాసన సభకు ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో ముఖ్యమంత్రి కె. చంద్ర శేఖర రావు ఈ నెల 15 వ తేదీ నుండి ఎన్నికల ప్రచారం ప్రారంభించనున్నారు. 15 వ తేదీన హుస్నాబాద్ నియోజక వర్గంలో నిర్వహించే బహిరంగ సభతో ఆయన ఎన్నికల ప్రచారం ప్రారంభమవుతుందని తెలుస్తోంది.

---

తెలంగాణా రాష్ట్రంలోని కాజీపేట నుండి పూణేలోని హడప్సార్ రైల్వే స్టేషన్ వరకు పొడిగించిన రైలును కేంద్ర పర్యాటక, సాంస్కృతిక వ్యవహారాల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి సికింద్రాబాదు స్టేషన్ నుండి వర్చువల్ గా ప్రారంభించారు. బోధన్– కరీంనగర్ ....., రాయచూర్ –నాందేడ్ ...., కర్నూలు ు జైపూర్ ల వరకు పొడిగించిన రైళ్ళను కూడా ఆయన వర్చువల్ గా ప్రారంభించారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణా లోని అన్ని ప్రధాన నగరాలు ...., పట్టణాలకు రైలు సర్వీసులను విస్తరించడానికి కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని ...., వచ్చే జనవరి నాటికి చెర్లపల్లి రైలు టెర్మినల్ సిద్ధమవుతుందని తెలిపారు.

---

స్కిల్ డెవలప్మెంట్ వ్యవహారంలో ఆంధ్ర ప్రదేశ్. సి. ఐ. డి. తనపై నమోదు చేసిన కేసును కొట్టి వేయాలని కోరుతూ తెలుగు దేశం పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడు దాఖలు చేసిన క్వాష్ పిటిషన్ పై సుప్రీం కోర్టులో విచారణ ఈ రోజుకు వాయిదా పడింది. జస్టిస్ అనిరుధ్ బోస్ ...., జస్టిస్ బేలా ఎం. త్రివేదిలతో కూడిన ధర్మాసనం ఈ అంశంపై విచారణ చేపట్టింది. చంద్రబాబు నాయుడు తరఫున సీనియర్ న్యాయవాదులు హరీష్

సాల్వే ...., అభిషేక్ మను సింఘ్వీ ...., సిద్ధార్థ లూథ్ర సుదీర్ఘంగా తమ వాదనలు వినిపించారు. 17 ఏలోని నిబంధనలను హరీష్ సాల్వే బెంచ్ ముందు ఉంచారు. ప్రభుత్వం తరపు న్యాయవాది ముకుల్ రోహత్గీ వాదనలు కూడా విన్న అనంతరం ఈ కేసు విచారణను ధర్మాసనం ఈ రోజుకి  వాయిదా వేసింది.

---------------------------

చైనా వేదికగా జరిగిన ఆసియా క్రీడలలో అద్భుతమైన ఆటను ప్రదర్శించి..... వివిధ  క్రీడాంశాలలో 107 పతకాలు సాధించిన భారతీయ క్రీడాకారుల బృందంతో  ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ఈరోజు సమావేశమవుతారు. ఢిల్లీలోని మేజర్ ధ్యాన్ చంద్ స్టేడియంలో ఈరోజు సాయంకాలం జరిగే ఈ సమావేశంలో ఆసియా క్రీడలలో పాల్గొన్న బృందంతో పాటు వారి శిక్షకులు...., భారతీయ ఒలంపిక్ సంఘం అధికారులు, జాతీయ క్రీడల సమాఖ్య ప్రతినిధులు, యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ అధికారులు పాల్గొంటారు.

---------------------------

తపాలా సేవల పట్ల ప్రజలకు అవగాహన కల్పించే ఉద్దేశంతో ఈ రోజు జాతీయ తపాలా దినోత్సవం నిర్వహిస్తున్నారు. బ్రిటిష్ ఇండియా గవర్నర్ జనరల్ లార్డ్ డల్ హౌసీ 1854 సంవత్సరంలో స్థాపించిన భారతీయ తపాలా శాఖ ..... ఇంత కాలంగా పోషిస్తున్న పాత్రను స్మరించుకోవడం కోసం ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. భారత దేశంలో నగర ...., పట్టణ ...., గ్రామీణ ప్రాంతాలకు మాత్రమే కాకుండా మారు మూల ప్రాంతాలకు సైతం తపాలా శాఖ అందిస్తున్న సేవలు ఎంతైనా చిరస్మరణీయం.  వినూత్న సేవలతో తపాలా శాఖ రోజు రోజుకీ ప్రజలకు మరింత చేరువ అవుతోంది. బ్యాంకులతో సమానంగా ప్రస్తుతం ప్రజలకు తపాలా సేవలు  అందుతుండడం ప్రశంసనీయం.

---------------------------

మానసిక సమస్యలపై అవగాహన పెంచడం కోసం ఈ రోజు ప్రపంచ మానసిక ఆరోగ్య  దినోత్సవం నిర్వహిస్తున్నారు.  మానసిక ఆరోగ్యానికి సంబంధించిన ప్రపంచ సమాఖ్య చొరవతో ప్రతి ఏటా అక్టోబర్ 10వ తేదీన ఈ కార్యక్రమం జరుగుతోంది.  ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని మొదటి సారిగా 1992 వ సంవత్సరం అక్టోబర్ 10 వ తేదీన నిర్వహించారు. మానసిక ఆందోళన ..., కుంగు బాటు ...., ఫోబియా ...., మానియా వంటి రుగ్మతలన్నీ  మానసిక అనారోగ్యానికి చిహ్నాలు. మానసిక వైద్య నిపుణుల ద్వారా ఈ రుగ్మతలకు తగిన చికిత్స పొందవచ్చు. అను  నిత్యం యోగాభ్యాసం ద్వారా మానసిక వైకల్యాన్ని అధిగమించవచ్చునని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.

---------------------------

ప్రపంచంతో పోటీ పడే విధంగా విద్యార్థినీ విద్యార్థులు రాణించాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వై. ఎస్. జగన్ మోహన్ రెడ్డి పిలుపునిచ్చారు.  అమెరికాలో వివిధ కార్యక్రమాలలో పాల్గొన్న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల బృందం నిన్న గుంటూరు జిల్లా తాడేపల్లిలో తనను కలుసుకున్న సందర్భంగా ఆయన మాట్లాడుతూ .....  అభివృద్ధి సాధించాలంటే విద్యే ఆధారమని ...,  విద్యతోనే జీవితాలు రాణిస్తాయని అన్నారు.  విదేశీ విద్యా దీవెన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి వారికి సూచించారు.

---------------------------

శ్రీకాకుళం నగరంలో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో నిన్న... “నా మట్టి నా దేశం” కలశ ర్యాలీ వైభవంగా జరిగింది.. స్థానిక సూర్యమహల్ కూడలి వద్ద గల స్వామి వివేకానంద విగ్రహం నుండి మేరీ మాటి మేరీ దేశ్ రెండవ విడత గ్రామాలు వార్డులు నుండి వచ్చిన కలశాలతో ర్యాలీ కార్యక్రమం ప్రారంభించారు. నగరంలోని ఏడు రోడ్ల కూడలి వరకు ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా బి.జె.పి శ్రీకాకుళం జిల్లా అధ్యక్షుడు బిర్లంగి ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ.. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పిలుపు మేరకు దేశవ్యాప్తంగా ఈ కార్యక్రమాన్ని జరుగుతోందన్నారు. భారతీయుల ఐక్యతను చాటి చెప్పే విధంగా ప్రతి ప్రాంతం నుండి మట్టిని సేకరించి దేశ రాజధాని ఢిల్లీలో స్మృతి వనం నిర్మించ తలపెట్టారని చెప్పారు. దేశం కోసం ప్రాణాలు త్యాగం చేసిన వారి పేరిట ఈ స్మృతి వనం నిర్మిస్తున్నారని అన్నారు.

======================